సాక్షి ప్రకాశం

శుక్రవారం । 10 । మార్చి । 2023



ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

వైఎస్సార్ సీపీకి ఈ ఎమ్మెల్సీ ఎన్నికలు సెమీఫైనల్ లాంటివని, గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఆ పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. - 8లో..



గంజాయిపై ఉక్కుపాదం

జిల్లాలో గంజాయిపై ఉక్కుపాదం మోపాలని ఎస్పీ మలికాగర్గ్ పోలీసు అధికారులను ఆదేశించారు. ఆయా కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని సూచించారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
32 /22

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వాతావరణంలో తేమ శాతం అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి

ఒంగోలు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘ జిల్లా శాఖ నాయకులు జిల్లా ఖజానా అధికారి, సహాయ ఖజానా అధికారి, సబ్ ట్రెజరీ అధికారులకు గురువారం వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు బి.అంకిరెడ్డి, సభ్యులు కంచర్ల సుబ్బారావు, కరీముల్లాఖాన్, మన్నం హనుమంతరావు, మహబూబ్ సుభాని, వెంకటేశ్వర్లు, వెంకటరావు, శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌కు అవకాశం

చిత్తూరు కలెక్టరేట్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేలా అధికారిక యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. కలెక్టరేట్‌లో జేసీ, డీఆర్‌వో చాంబర్లలో ప్రత్యేక సీల్డ్ బాక్సులు ఉంచింది. ఓటు హక్కు ఉన్న సిబ్బంది, అధికారులు తమ ఓటు అందులో వేయవచ్చని అధికారులు సూచిస్తున్నారు. తిరుపతి, అన్నమయ్య, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని కలెక్టరేట్లలో పోస్టల్ బ్యాలెట్ బాక్సులు ఏర్పాటు చేశారు.

ఐ అండ్ పీఆర్ ఏడీని సత్కరించిన సిబ్బంది



ఏడీ గ్రేస్‌లినోరాను సత్కరిస్తున్న సిబ్బంది

ఒంగోలు అర్బన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం నేపథ్యంలో జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.గ్రేస్‌లినోరాను సిబ్బంది గురువారం ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యాలయంలో పనిచేస్తున్న ఆరుగురు మహిళా ఉద్యోగులను సిబ్బంది సత్కరించారు. కార్యాలయంలో దాదాపు సగభాగం మహిళా ఉద్యోగులు విధులు నిర్వహిస్తూ తమవంతు పాత్రపోషిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఏపీఆర్వో దుర్గాప్రసాద్, యూడీసీ ఖాదర్ మస్తాన్, ఫొటోగ్రాఫర్ తోట శ్రీనివాసరావు, వీడియో గ్రాఫర్ అలీ, రికార్డు అసిస్టెంట్ కె.శ్యామ్యూల్, ఇన్ఫర్మేషన్ టెక్నీషియన్లు వినయ్‌కుమార్, మణికుమార్, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

హైవేల నిర్మాణాలకు త్వరగా భూ సేకరణ చేయాలి

- రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ కార్యదర్శి ప్రద్యుమ్న



కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ అభిషిక్త్‌కిషోర్‌తో సమీక్షిస్తున్న ప్రద్యుమ్న

ఒంగోలు అర్బన్: జిల్లా సరిహద్దుల్లో వెళ్తున్న బెంగళూరు–కడప–విజయవాడ ఎక్స్‌ప్రెస్ హైవేల నిర్మాణాలను అవసరమైన భూ సేకరణను ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లాకు వచ్చిన అయన.. స్థానిక ప్రకాశం భవనంలో కలెక్టర్ దినేష్‌కుమార్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో భూ సేకరణ పురోగతిని కలెక్టర్ వివరించారు. 2025 అక్టోబర్ నాటికి రహదారిని వినియోగంలోకి తీసుకురావాలనేది ప్రభుత్వ లక్ష్యమని, ఆ మేరకు పనులు వేగవంతం చేయాలని సూచించారు. అదేవిధంగా జాతీయ రహదారి నంబర్ 765లో మిగిలి ఉన్న భూ సేకరణను కూడా త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ విజయరత్నం, ఒంగోలు ఆర్డీవో విశ్వేశ్వరరావు, ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సుధాకర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఉమాదేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారి డిస్మిస్.?

కొనకనమిట్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పనిచేసే కీలకమైన రెవెన్యూ అధికారిని ఉద్యోగం నుంచి తొలగిస్తూ ప్రభుత్వం నుంచి ఒంగోలు కలెక్టరేట్‌కు ఆదేశాలు అందినట్లు తెలిసింది. ఈయన గతంలో పశ్చిమ ప్రకాశంలోని నల్లమల సరిహద్దు మండలంలో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఆ సమయంలో అక్కడి ప్రభుత్వ భూములకు అక్రమంగా పట్టాలివ్వడంపై ఉన్నతాధికారులు, ప్రభుత్వానికి ఫిర్యాదులందాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. జిల్లా ఉన్నతాధికారులు విచారణ చేసి ఆరోపణలు వాస్తవమేనని ప్రభుత్వానికి నివేదిక ఇవ్వడంతో అతన్ని ఉద్యోగం నుంచి తొలగిస్తూ కలెక్టరేట్‌కు ఉత్తర్వులు పంపినట్లు సమాచారం. గతేడాది ఈ అధికారి భూముల విషయంలో సస్పెండ్ అయ్యారు. రెండుమూడు రోజుల్లో నేరుగా అతనికి డిస్మిస్ ఉత్తర్వులు ఇవ్వనున్నట్లు సమాచారం.



ఒకప్పుడు పాడి పరిశ్రమకు జిల్లా పెట్టింది పేరు. ఒంగోలు గిత్త ప్రపంచ ప్రఖ్యాతిగాంచింది. అదేస్థాయిలో పాడి పరిశ్రమ కూడా విరాజిల్లుతూ వచ్చింది. కానీ, గత తెలుగుదేశం పాలకుల నిర్లక్ష్యం ఫలితంగా ఉనికి కోల్పోయే స్థితికి చేరుకుంది. పాడి పరిశ్రమకు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిచ్చింది. రాష్ట్ర సర్కార్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న పాలవెల్లువ' కార్యక్రమం ద్వారా క్షీర విప్లవానికి అడుగులు పడ్డాయి. ప్రస్తుతం పాల పొంగులతో పాడి రైతన్నల్లో దరహాసం విరబూస్తోంది.

క్షీర సిరులు

- జగనన్న పాల వెల్లువకు ప్రత్యేక ప్రణాళిక
- జిల్లాలోని 244 గ్రామాల్లో కేంద్రాలు
- మిగతా గ్రామాలకు విస్తరించేందుకు చర్యలు
- గ్రామ స్థాయిలో వలంటీర్ల ద్వారా సర్వే
- ఇప్పటి వరకు 4,925 మంది మహిళా పాడి రైతులకు లబ్ధి
- గేదెల కొనుగోలుకు రూ.49.53 కోట్లు అందజేత
- పాడి రైతులను నిలువునా మోసం చేసిన టీడీపీ
- భరోసా కల్పిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: జగనన్న పాల వెల్లువ కార్యక్రమం జిల్లాలో పాల పొంగులా సాగుతోంది. అందుకోసం అధికారులు ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. జిల్లాలో క్షీర విప్లవానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్ శ్రీకారం చుట్టింది. తెలుగుదేశం హయాంలో నిలువునా మోసపోయిన జిల్లా పాడి రైతుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా నిలిచింది. పాడి పరిశ్రమకు పెట్టింది పేరుగా ఉన్న జిల్లాకు పూర్వ వైభవం తీసుకొచ్చే దిశగా ప్రభుత్వం, జిల్లా అధికారులు ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తున్నారు. ఒంగోలు డెయిరీని టీడీపీ పాలకమండలి నిలువునా మోసం చేసి సహకార రంగంలో ఉన్న డెయిరీని కంపెనీ యాక్ట్‌లోకి మార్చింది. ఒక పథకం ప్రకారం అప్పుల ఊబిలోకి నెట్టి ఒట్టిపోయిన గేదెలా తయారు చేసింది. ఇదే అదనుగా భావించిన హెరిటేజ్ డెయిరీతో పాటు ఇతర ప్రైవేటు డెయిరీలు పాలకు సరైన ధర ఇవ్వకుండా రైతులను నిలువుదోపిడీ చేశాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత జిల్లా కేంద్రంలో ఉన్న ఒంగోలు డెయిరీ పరిస్థితిని గమనించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమూల్‌ను రంగంలోకి దించి పాడి రైతులకు పూర్వ వైభవాన్ని సంతరించిపెట్టే విధంగా ప్రణాళికలు రూపొందించారు. గ్రామాల్లో వార్డు వలంటీర్ల ద్వారా సర్వే చేయిస్తున్నారు.

ఆర్థిక పురోభివృద్ధి దిశగా...

జగనన్న పాల వెల్లువతో మహిళలు ఆర్థిక పురోభివృద్ధి సాధించే దిశగా ముందుకు సాగుతున్నారు. అందుకు తగ్గట్టుగా మహిళా పాడి రైతులకు అధికారులు ఆర్థిక ప్రయోజనాలు చేకూరుస్తున్నారు. అమూల్‌ను రంగంలోకి దించి జిల్లా యంత్రాంగం మొత్తాన్ని 'జగనన్న పాలవెల్లువ' కార్యక్రమంలో భాగస్వాములను చేశారు. తొలివిడతలో జిల్లాలోని 201 గ్రామాల్లో పాల కేంద్రాలను ప్రారంభించారు. 2020 నవంబర్ నుంచి తొలుత ప్రారంభించిన పాల కేంద్రాల్లో పాలు సేకరించేందుకు 20 రూట్లు ఏర్పాటు చేశారు. ఇటీవల మరో 43 కేంద్రాలను విస్తరింపజేశారు. ప్రస్తుతం 244 గ్రామాల్లో కేంద్రాలు ఉన్నాయి. ప్రతిరోజూ 18,500 నుంచి 20 వేల లీటర్ల పాలు సేకరించే విధంగా ఏర్పాట్లు చేసి సమీకరిస్తున్నారు. మొత్తం మీద ఇప్పటి వరకు జిల్లాలో 91.81 లక్షల లీటర్ల పాలు సేకరించారు. అందుకుగానూ రూ.58.18 కోట్లు మహిళా పాడి రైతుల బ్యాంకు ఖాతాలకు జమచేశారు.

పాడి గేదెల ద్వారా ప్రోత్సాహం...

పాడి రైతులకు జీవనోపాధి కల్పించడమే లక్ష్యంగా అధికారులు 'జగనన్న పాల వెల్లువ' పథకం ద్వారా మహిళలకు పాడి గేదెలను అందజేసి ప్రోత్సహిస్తున్నారు. పాలుపోసే రైతులకు పాడి గేదెల కొనుగోలు కోసం వివిధ సంక్షేమ పథకాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. డీఆర్‌డీఏ ద్వారా ఈ పథకాన్ని వేగవంతంగా మహిళా పాడి రైతులకు విరివిగా బ్యాంకుల నుంచి రుణాలు అందిస్తున్నారు. అదే విధంగా జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ద్వారా జిల్లా వ్యాప్తంగా సహకార బ్యాంకుల నుంచి పాడి పశువుల కొనుగోలు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఎక్కువ మోతాదులో పాలిచ్చే ముర్రా జాతి గేదెలతో పాటు ఇతర మేలు రకం జాతి గేదెల కొనుగోలు చేపట్టారు. ఒక్కో గేదెను రూ.లక్ష వెచ్చించి కొనుగోలు చేయడానికి పూనుకున్నారు. కొనుగోలుకు వర్కింగ్ కేపిటల్ కింద ఒక్కొక్క గేదెకు ప్రధాన మంత్రి పశు కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా రూ.30 వేలు, బ్యాంకుల ద్వారా రూ.70 వేలు అందిస్తున్నారు. ఇప్పటికే జిల్లాలోని 4,925 మంది మహిళా రైతులకు రూ.49.53 కోట్లను రుణాల రూపంలో అందించారు. సహకార బ్యాంకుతో పాటు కమర్షియల్ బ్యాంకుల ద్వారా రుణాలిచ్చి ప్రోత్సహిస్తున్నారు. అదేవిధంగా సెర్ప్ ద్వారా పాడి రైతులకు రుణాలు అందజేశారు. గ్రామ స్థాయిలో పాల వెల్లువ కేంద్రాల ఏర్పాటుకు వలంటీర్ల ద్వారా సర్వే చేయిస్తున్నారు. పాడి రైతులకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలను అందుబాటులోకి తీసుకొస్తున్నారు. పాల వెల్లువకు పాలుపోసే మహిళా రైతుల పశుగణాభివృద్ధి కోసం రైతు భరోసా కేంద్రాల ద్వారా పశుగ్రాస విత్తనాలు, దాణామృతం (టీఎంఆర్), 40 శాతం రాయితీపై పశుగ్రాసాన్ని ముక్కలుగా చేసే ఛాఫ్ కట్టర్స్‌ను రైతులకు అందించనున్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా...



గ్రామీణ ప్రాంతాల్లో మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాం. జగనన్న పాల వెల్లువ కార్యక్రమం ద్వారా మహిళా పాడి రైతులకు జీవనోపాధి కల్పిస్తున్నాం. ఎలాంటి షూరిటీలు లేకుండా పాలు పోసే మహిళా పాడి రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలిప్పిస్తున్నాం. గ్రామాల్లో ప్రతి ఇంటిలో పాడి పరిశ్రమ ఉండేలా ప్రణాళికలు రూపొందించాం.

– డాక్టర్ కొప్పురపు బేబీరాణి, జాయింట్ డైరెక్టర్, జిల్లా పశుసంవర్ధకశాఖ

అనేక పథకాల ద్వారా పాడి రైతులకు ప్రోత్సాహం



జగనన్న పాల వెల్లువ పథకంలో మహిళా పాడి రైతులకు అనేక పథకాల ద్వారా ఆర్థికసాయం అందిస్తూ ప్రోత్సహిస్తున్నాం. చేయూత, ఆసరా, శ్రీనిధి, ఉన్నతి, సెర్ప్ ద్వారా రుణాలందిస్తున్నాం. పీడీసీసీబీతో పాటు అన్ని జాతీయ బ్యాంకుల నుంచి ఒక్కొక్కరికి రూ.30 వేల నుంచి రూ.లక్ష వరకు రుణాలిచ్చి ప్రోత్సహిస్తున్నాం. డీఆర్‌డీఏ సిబ్బందితో పాటు గ్రామాల్లో వలంటీర్ల ద్వారా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియపై సర్వే చేయిస్తున్నాం.

– బి.బాబూరావు, పీడీ, డీఆర్‌డీఏ

రేపు జిల్లాస్థాయి మహిళా ఖోఖో పోటీలు

- ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వీసీ మారెడ్డి అంజిరెడ్డి



మాట్లాడుతున్న వీసీ మారెడ్డి అంజిరెడ్డి

ఒంగోలు: స్థానిక ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ ఉదయం 10.30 గంటలకు జిల్లాస్థాయి మహిళా ఖోఖో పోటీలు నిర్వహించనున్నట్లు ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ మారెడ్డి అంజిరెడ్డి తెలిపారు. స్థానిక తన చాంబరులో గురువారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో తొలిసారిగా ఆటల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా దేశవ్యాప్తంగా 50 జిల్లాలను ఎంపిక చేసుకుని ప్రతి జిల్లాకు ఒక గేమ్ నిర్వహించాలని ఆదేశించిందన్నారు. ప్రకాశం జిల్లాకు ఖోఖో క్రీడను ఇచ్చారన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల్లో చైతన్యాన్ని తీసుకొచ్చేందుకు, ఆరోగ్యాన్ని పెంపొందించే కార్యక్రమంలో భాగంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఖేలో ఇండియా టెన్ కా ధమ్ పేరుతో కనీసం పది జట్లకు తగ్గకుండా పోటీలు నిర్వహించాలని నిర్ణయించడం జరిగిందన్నారు. ఈ పోటీలకు పరిశీలకులుగా ఖేలో ఇండియా కో ఆర్డినేటర్ డాక్టర్ డీఎన్‌వీ వినాయక్ ప్రసాద్ హాజరవుతారన్నారు. ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కోరుతున్నామన్నారు. పేర్నమిట్ట కొండమీద ఉన్న అకడమిక్ బ్లాక్‌ను సిద్ధం చేస్తున్నామని, అదే విధంగా రోడ్డును కూడా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని వీసీ అంజిరెడ్డి తెలిపారు. 2023–24 అడ్మిషన్లను ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం పేరుతోనే ప్రారంభిస్తామని, కాలేజీల గుర్తింపును కూడా ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం పేరుతోనే ఇస్తామని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో డాక్టర్ డి.వెంకటేశ్వరరెడ్డి, ఓఎస్‌డీ డాక్టర్ కేవీ రాజు, స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ బాణాన కృష్ణ, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం కో ఆర్డినేటర్ డాక్టర్ ఐ.దేవీ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు ఓటమి భయం

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడిపోతారనే భయంతోనే దొంగ ఓట్లు అంటూ తప్పుడు ప్రచారం
- ఎవరెన్ని కుట్రలు పన్నినా వైఎస్సార్ సీపీదే విజయం
- ఈ నెలాఖరుకు ఉద్యోగులు, ఉపాధ్యాయుల బకాయిలకు రూ.3 వేల కోట్లు
- విశ్వాసం చూపండి.. విజయంలో భాగస్వాములు కండి
- పట్టభద్రులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులకు బాలినేని శ్రీనివాసరెడ్డి పిలుపు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బాలినేని శ్రీనివాసరెడ్డి, పక్కన శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు: ఎమ్మెల్సీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టీడీపీ అధినేత చంద్రబాబుకు ఓటమి భయం పట్టుకుని మతిభ్రమించిందని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఎద్దేవా చేశారు. ఒంగోలులోని తన నివాసంలో వైఎస్సార్ సీపీ తూర్పురాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డితో కలిసి గురువారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ పట్టభద్రుల ఓట్ల చేర్పుల్లో అక్రమాలు ఎలా జరుగుతాయో తమకు అర్థం కావడం లేదన్నారు. తాము పరిశీలిస్తుంటే.. కొన్ని బూత్‌లలో ఓటర్లు తేలడం లేదన్నారు. దానిని బట్టి దొంగ ఓట్లు ఏమైనా ఉంటే ఆ వ్యవహారం చంద్రబాబు కనుసన్నల్లోనే జరిగి ఉండాలన్నారు. అచ్చెన్నాయుడు సైతం ఇదే వ్యవహారంపై మాట్లాడుతున్నాడని, కేవలం ఓటమికి తాము కారకులం కాదని చెప్పుకునేందుకే ఇదంతా చేస్తున్నారని స్పష్టమవుతోందని బాలినేని పేర్కొన్నారు. ఓట్ల నమోదు, తొలగింపు సమయంలోనే అర్హత లేని ఓటర్లను ఎన్నికల కమిషన్ తొలగించిందని, అప్పట్లో మౌనంగా ఉన్న చంద్రబాబు.. నేడు దొంగ ఓట్లు అంటూ పసలేని ఆరోపణలు చేస్తున్నారని బాలినేని ధ్వజమెత్తారు. గెలవడం కష్టమని తేలడంతో చాలాచోట్ల యూటీఎఫ్‌తో టై అప్ అవ్వాలనే ఆలోచన కూడా టీడీపీ చేసినట్లు తెలుస్తోందన్నారు. 40 సంవత్సరాల రాజకీయ అనుభవం, 14 సంవత్సరాల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన అనుభవం ఉన్నప్పటికీ ఒంటరిగా పోటీ చేయలేమనే భయం టీడీపీని పట్టిపీడిస్తోందని విమర్శించారు. చంద్రబాబు ఏ ఎన్నికలు చూసినా బీజేపీ, జనసేన, కమ్యూనిస్టులు.. ఇలా ఏదో ఒక పార్టీతో పొత్తు లేకుండా పోటీచేసిన దాఖలాలు లేవన్నారు. కానీ, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ స్థాపించింది మొదలు ఒంటరిగానే సింహంలా పోరాటం చేస్తున్నారన్నారు. విశాఖ గ్లోబల్ సమ్మిట్ విజయవంతం కావడంతో తట్టుకోలేక చంద్రబాబు మతిభ్రమించి ఏదేదో మాట్లాడుతున్నాడన్నారు. అతని పిచ్చి ప్రేలాపనలను ఓటర్లు నమ్మే స్థితిలో లేరన్నారు. చేతనైతే చంద్రబాబు కూడా ఒంటరిగా పోరాటం చేసేందుకు ముందుకు రావాలని సవాల్ విసిరారు. గతంలో పీడీఎఫ్ అభ్యర్థులు ఎమ్మెల్సీలుగా గెలిచినా వారు ప్రభుత్వంతో సరైన కోణంలో సంప్రదించకపోవడం వలనే ఉపాధ్యాయులకు సమస్యలు నెలకొన్నాయన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో ప్రభుత్వంతో నేరుగా చర్చిస్తూ ఉపాధ్యాయులకు అండగా నిలిచేందుకు ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి పోటీచేస్తున్నారని, వారిని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

నెలాఖరులోపు బకాయిలు తీరుస్తాం...

ఉపాధ్యాయులు, ఉద్యోగులకు సంబంధించిన బకాయిలు చెల్లించేందుకు ప్రభుత్వం ఈ నెలాఖరుకు రూ.3 వేల కోట్లు విడుదల చేయనుందని బాలినేని వెల్లడించారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఈ విషయాన్ని విశ్వసించాలని కోరారు. విశ్వాసంగా వ్యవహరిస్తూ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఏరోజూ ముఖ్యమంత్రి వ్యతిరేకం కాదని, వారి సమస్యలను చిత్తశుద్ధితో తీర్చాలనే ఉన్నారని వెల్లడించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా కొంత జాప్యం జరిగిందని తెలిపారు. పచ్చ పత్రికల విషపురాతలను ప్రజలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు సంపూర్ణంగా అర్థం చేసుకున్నారన్నారు.

రానున్న మూడురోజుల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపునకు సంబంధించి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అవిశ్రాంతంగా శ్రమించాలని కోరారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా విజయం వైఎస్సార్ సీపీదే అని బాలినేని స్పష్టం చేశారు. మీడియా సమావేశంలో మేయర్ గంగాడ సుజాత, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- ప్రధాన ఎన్నికల అధికారికి తెలిపిన కలెక్టర్ దినేష్‌కుమార్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ అభిషిక్త్ కిషోర్

ఒంగోలు అర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికలకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్‌మీనాకు కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. గురువారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. స్థానిక ప్రకాశం భవనం నుంచి కలెక్టర్ దినేష్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో ఎన్నికలకు చేస్తున్న ఏర్పాట్లను కలెక్టర్ వివరించారు. ఎన్నికల సామగ్రి, బ్యాలెట్ బాక్సులను పోలీసు బందోబస్తుతో ఆయా డివిజన్ కేంద్రాల్లోని తాత్కాలిక స్ట్రాంగ్ రూములకు తరలించామన్నారు. పోలింగ్ అధికారులకు తగిన శిక్షణలు కూడా పూర్తి చేశామన్నారు. పోలింగ్ అనంతరం పోలింగ్ సామగ్రిని డివిజన్లలోని తాత్కాలిక స్ట్రాంగ్ రూముల నుంచి ఆయా సబ్ కలెక్టర్లు, ఆర్డీవోలతో తగిన భద్రతా చర్యల ద్వారా చిత్తూరులో ఏర్పాటు చేసే రిసెప్షన్ సెంటర్‌లో రిటర్నింగ్ అధికారికి చేర్చే విధంగా అన్ని చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ వివరించారు. వీడియో సమావేశంలో జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరగాలి

- ఎస్పీ మలికాగర్గ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు టౌన్: ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ఈ నెల 13వ తేదీ జిల్లాలో ప్రశాంతంగా జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీ మలికాగర్గ్ పోలీసు అధికారులను ఆదేశించారు. స్థానిక పోలీసు కల్యాణ మండపంలో గురువారం నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలీసు అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఎన్నికలు ముగిసేంత వరకు ఎన్నికల సంఘం నియమావళి ప్రకారం కచ్చితంగా కోడ్ అమలు చేయాలని స్పష్టం చేశారు. స్ట్రాంగ్ రూంల వద్ద సీసీ కెమేరాలు ఏర్పాటు చేసి ప్రత్యేకంగా సెక్యూరిటీని నియమించాలని, స్థానిక పోలీసు అధికారులు పర్యవేక్షిస్తూ ఉండాలని చెప్పారు. ట్రబుల్ మాంగర్స్, రౌడీషీటర్లను ముందుగానే గుర్తించి చట్ట ప్రకారం బైండోవర్ చేయాలని, చెక్‌పోస్టుల వద్ద విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలని, పోలింగ్ ముందు రోజు నుంచే ప్రత్యేక టీంల ద్వారా నిరంతర నిఘా ఉంచాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలకు 100 కిలోమీటర్ల దూరం వరకు మార్కింగ్ చేసి 144 సెక్షన్ అమలు చేయాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సున్నితమైన, సమస్యాత్మక ప్రాంతాల్లో అదనంగా సిబ్బందిని నియమించాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ (అడ్మిన్) కే నాగేశ్వరరావు, ఏఎస్పీ (క్రైం) ఎస్‌వీ శ్రీధర్‌రావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, డీఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు, సబ్ డివిజన్ డీఎస్పీలు యు.నాగరాజు, నారాయణ స్వామిరెడ్డి, డీటీసీ డీఎస్పీ రామకృష్ణ, దిశా డీఎస్పీ పల్లపురాజు, ట్రాఫిక్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు

- ఇంటర్ పరీక్షల శిక్షణకు హాజరైన అధికారులకు కలెక్టర్ దినేష్‌కుమార్ హెచ్చరిక



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు: ఇంటర్ పరీక్షల నిర్వహణలో ఏమాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ హెచ్చరించారు. ఇంటర్ పరీక్షల నిర్వహణకు నియమితులైన చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ ఆఫీసర్లు, కస్టోడియన్లు, స్క్వాడ్ అధికారులతో స్థానిక ఆంధ్రకేసరి విద్యాకేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్ బోర్డు సూచించిన పరీక్షల నియమావళిని తప్పక పాటించాలన్నారు. మౌలిక వసతుల కల్పనలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడినా, ప్రోత్సహించినా, సహకరించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరీక్షలు నిర్వహించే అధికారులు పరీక్ష కేంద్రాన్ని పూర్తిగా తమ నియంత్రణలోకి తీసుకోవాలన్నారు. పరీక్షలకు సంబంధంలేని ప్రైవేటు వ్యక్తులు పరీక్ష కేంద్ర ప్రాంగణాల్లో సంచరించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యార్థులను పరీక్ష గదుల్లోకి పంపేటప్పుడే బందోబస్తులో ఉన్న సిబ్బంది సాయంతో క్షుణ్ణంగా తనిఖీ చేసి వారి వద్ద ఎలాంటి కాపీలు లేకుండా చూడాలన్నారు. జిల్లా పరీక్షల కమిటీకి, పరీక్షల నిర్వహణాధికారులకు ఈ సందర్భంగా పలు సలహాలు, సూచనలు చేశారు. ప్రశ్నపత్రాల తరలింపు ప్రక్రియ నుంచి సమాధాన పత్రాల బండిల్స్‌ను పోస్టాఫీసులో డిపాజిట్ చేసేంత వరకు ప్రతి దశలోనూ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇన్విజిలేటర్లు, విద్యార్థుల నుంచి ఫీడ్‌బ్యాక్ కూడా తీసుకోవాలన్నారు. ఇంటర్ విద్య ఆర్జేడీ వీవీ సుబ్బారావు మాట్లాడుతూ ప్రతి గదిలో సీసీ కెమేరా ఉంచాలన్నారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన అధికారులు, సిబ్బందిని ఇప్పటికే నియమించడం పూర్తయిందని, ఎవరైనా విధులు సరిగా నిర్వహించని వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్‌ఐవో ఎ.సైమన్ విక్టర్ మాట్లాడుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లావ్యాప్తంగా 95 పరీక్ష కేంద్రాల్లో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. పరీక్షల నిర్వహణకు ఎప్పటికప్పుడు డీఈసీ తగు మార్గనిర్దేశం చేస్తోందని, పాటించాలని సూచించారు. సమావేశంలో డీవీఈవోలు ఎస్‌వీ సుబ్బారావు, కె.ఆంజనేయులు, కె.నాగేశ్వరరావు, డీఈసీ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డీవార్మింగ్ డే పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి, డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి

ఒంగోలు అర్బన్: చిన్నపిల్లల్లో నులి పురుగులను నివారించేందుకు పక్కాగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశించారు. ఈ నెల 14వ తేదీ నేషనల్ డీ వార్మింగ్ డే నిర్వహణకు సంబంధించిన పోస్టర్‌ను వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రకాశం భవనంలో కలెక్టర్ గురువారం ఆవిష్కరించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు ఇంకా చిన్న పిల్లలు ఉండే ప్రాంతంలో డీ వార్మింగ్ మాత్రలు పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి, జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

చీమకుర్తి: భర్త వేధింపులు తట్టుకోలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం తెల్లవారుజామున కంభంపాడు గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. టంగుటూరుకు చెందిన బొమ్మల పున్నమ్మ తన కుమార్తె కల్యాణిని 12 ఏళ్ల క్రితం కంభంపాడుకు చెందిన కడియం రవీంద్రకు ఇచ్చి వివాహం చేశారు. వారికి పదేళ్లలోపు వయసున్న కుమార్తె, కుమారుడు ఉన్నారు. రవీంద్ర లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ మద్యానికి బానిసై మరో మహిళతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. భార్య కల్యాణిని నిత్యం వేధింపులకు గురిచేస్తున్నాడు. రెండు రోజుల నుంచి వేధింపులు ఎక్కువ కావడంతో భరించలేక గురువారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఇంట్లోనే ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని మృతి చెందినట్లు పోలీసులు ధ్రువీకరించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ వెంకట్రావు కేసు నమోదు చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

- గత ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థులను మన మద్దతుతోనే గెలిపించాం
- పెద్దల సభలో ఇంగ్లిష్ మీడియం బిల్లుకు మోకాలడ్డారు
- వారికి విద్యాభివృద్ధిపై చిత్తశుద్ధి లేదు
- వైఎస్సార్ సీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి
- పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి దిశానిర్దేశం



టంగుటూరులో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతున్న బాలినేని, పక్కన శ్యాంప్రసాద్‌రెడ్డి, వరికూటి

టంగుటూరు(సింగరాయకొండ): వైఎస్సార్ సీపీకి ఎమ్మెల్సీ ఎన్నికలు సెమీ ఫైనల్స్ లాంటివని, అత్యధిక మెజార్టీతో గెలవడమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ రీజినల్ కోఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి దిశానిర్దేశం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం టంగుటూరు టోల్‌ప్లాజా సమీపంలోని బీసీడి ఉదయకుమార్ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన కొండపి నియోజకవర్గ స్థాయి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో బాలినేని ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పార్టీ శ్రేణులను ఉద్దేశించి బాలినేని మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తొలిసారి వైఎస్సార్ సీపీ పోటీ చేస్తోందన్నారు. గతంలో వైఎస్సార్ సీపీ మద్దతుతో నలుగురు పీడీఎఫ్ అభ్యర్థులను గెలిపించామని గుర్తుచేశారు. కానీ, ఆ ఎమ్మెల్సీలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో చేస్తున్న అభివృద్ధికి మద్దతు తెలపకుండా మోకాలడ్డారని విమర్శించారు. ముఖ్యంగా విద్యలో ఇంగ్లిషు మీడియంను తప్పనిసరి చేస్తూ పెద్దల సభలో బిల్లు ప్రవేశపెడితే ఆ బిల్లును అడ్డుకున్నారని ఆక్షేపించారు. ఈ నేపథ్యంలోనే సీఎం వైఎస్ జగన్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులతో పోటీ చేయాలని నిర్ణయించారన్నారు. ఆయన మనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, విభేదాలు పక్కన పెట్టి తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతనేని చంద్రశేఖరరెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపించాల్సిన అవసరముందని పేర్కొన్నారు. సెమీఫైనల్‌లో అత్యధిక మెజారిటీ సాధిస్తే ఫైనల్‌లో వరికూటి గెలుపు తథ్యమన్నారు. చంద్రబాబుకు ఒంటరిగా పోటీ చేసే సత్తా లేదని ఎద్దేవా చేశారు. ప్రతిసారి ఎవరితో ఒకరితో పొత్తు పెట్టుకుని గెలవాలని ప్రయత్నిస్తాడని, అందుకే ఎమ్మెల్సీ ఎన్నికల్లో దొంగ ఓట్లు సృష్టించారని అసత్య ప్రచారం చేస్తున్నాడని దుయ్యబట్టారు. ఎన్నిక ఏదైనా జగన్ సింహంలా సింగిల్‌గా వస్తారని కొనియాడారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ..

నియోజకవర్గ నాయకులతో తనకు అనుబంధం ఉందని, ఈ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీ తీసుకువచ్చేందుకు కృషి చేయాలని కోరారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు మాట్లాడుతూ.. పీడీసీసీబీ చైర్మన్ మాదాసి వెంకయ్యతో పాటు ముఖ్య నాయకులను సమన్వయం చేసుకుని పార్టీ గెలుపునకు కృషి చేస్తున్నానన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, టంగుటూరు, మర్రిపూడి ఎంపీపీలు పటాపంజుల కోటేశ్వరరమ్మ, వాకా వెంకటరెడ్డి, టంగుటూరు, కొండపి, జరుగుమల్లి, పొన్నలూరు, చీమకుర్తి జెడ్పీటీసీలు మన్నం అరుణకుమారి, మారెడ్డి అరుణకుమారి, మాతంగి చంద్రలీల, బెజవాడ వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి, సింగరాయకొండ సర్పంచ్ తాటిపర్తి వనజ, వైఎస్సార్ టీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కేశవరపు జాలిరెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి యన్నాబత్తిన చిన్నా, బెల్లం సత్యన్నారాయణ, షేక్ సలీంబాషా, పల్లా అనూరాధ, ఆరు మండలాల జేసీఎస్ కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన ఎమ్మెల్యే బుర్రా



కనిగిరి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో కనిగిరి ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్‌యాదవ్ గురువారం కలిశారు. కుమారుడు వెంకటసాయితో కలిసి సీఎంకు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు, సమస్యలను సీఎంకు వివరించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

కమనీయం.. శ్రీవారి కల్యాణం



శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు



కల్యాణం తిలకిస్తున్న భక్తులు

కొనకనమిట్ల: వెలుగొండలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. గురువారం వేకువజామున శ్రీలక్ష్మీ అలివేలు మంగ సమేత వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు సమర్పించిన ముత్యాలతో స్వామివారికి తలంబ్రాలు పోశారు. తొలుత దేవస్థానంలో శోభాయమానంగా అలంకరించిన కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు వేద పండితులు పూజలు చేశారు. నిశ్చితార్థ రాయబార ఘట్టం చలోక్తులతో ఆసక్తికరంగా సాగింది. ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ సాని కొమ్ము తిరుపతిరెడ్డి, ధర్మకర్తల పర్యవేక్షణలో ఉభయదాతలు వాగిచెర్ల, జూటూరి, మూర్తి, తాడి కుటుంబ సభ్యులు శ్రీవారికి పసిడి, రజత ఆభరణాలు, పట్టు వస్త్రాలు సమర్పించారు. కల్యాణ వ్యాఖ్యాతగా తాల్లూరి దుర్గా వెంకటేశ్వరరావు వ్యవహరించారు. కల్యాణాన్ని తిలకించేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కల్యాణం అనంతరం మహిళలకు ముత్యాల తలంబ్రాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఉత్సాహంగా ఎడ్ల పందేలు

- పోటీలను ప్రారంభించిన జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



ఎడ్ల పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



వర్ధంతి సభలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి

బేస్తవారిపేట: మాజీ ఎమ్మెల్యే కందుల నాగార్జునరెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా స్థానిక ఆర్కే నగర్ జంక్షన్‌లో గురువారం ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి ఎడ్ల బండ లాగుడు పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. కందుల నాగార్జునరెడ్డి కుమారుడు డాక్టర్ కందుల గౌతమ్ నాగిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ పోటీలను జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి ప్రారంభించారు. తొలుత మాజీ ఎమ్మెల్యే కందుల నాగార్జునరెడ్డి చిత్రపటానికి ముఖ్య అతిథులతోపాటు ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, పలువురు నాయకులు, అభిమానులు ఘనంగా నివాళులర్పించారు. బండ పందెంలో 19 జతల ఎడ్లు పాల్గొనగా గురువారం రాత్రి ఫ్లడ్ లైట్ల వెలుగులో పోటీలు కొనసాగాయి.

సత్తా చాటిన నంద్యాల జిల్లా ఎడ్లు

గిద్దలూరు రూరల్: మండలంలోని నరవ గ్రామంలో లక్ష్మీ నరసింహస్వామి తిరునాళ్ల సందర్భంగా గురువారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి న్యూ కేటగిరీ విభాగం ఎడ్ల పోటీల్లో నంద్యాల జిల్లాకు చెందిన ఎడ్లు ప్రథమ స్థానంలో నిలిచాయి. నంద్యాల జిల్లా పెద్దకొట్టాలకు చెందిన బోరెడ్డి కేశవరెడ్డి ఎడ్లు 4,900 అడుగులు లాగి మొదటి బహుమతి రూ.50 వేలు, ప్రకాశం జిల్లా కారంవారిపల్లెకు చెందిన కాటం పెద్దిరెడ్డి ఎడ్లు 4,733 అడుగులు లాగి రెండో బహుమతి రూ.40 వేలు, బురుజుపల్లెకు చెందిన ఎర్రమల సోహిత్‌రెడ్డి ఎడ్లు 3,919 అడుగులు లాగి మూడో బహుమతి రూ.25 వేలు, వైఎస్సార్ జిల్లా బాలయ్యగారిపల్లెకు చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి ఎడ్లు 3,645 అడుగులు లాగి నాలుగో బహుమతి రూ.15 వేలు, కంభంకు చెందిన గోళ్ల పుల్లారెడ్డి ఎడ్లు 3,425 అడుగులు ఐదో బహుమతి రూ.10 వేలు, అర్ధవీడుకు చెందిన గొట్టం రంగలక్ష్మమ్మ ఎడ్లు 3,403 అడుగులు లాగి ఆరో బహుమతి రూ.5 వేలు గెలుపొందాయి. ఎడ్ల పోటీలను తిలకించేందుకు చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. విజేతలకు బహుమతులిచ్చేందుకు ఎమ్మెల్యే అన్నా రాంబాబు కుమారుడు కృష్ణచైతన్య అన్నా ట్రస్టు తరఫున రూ.80 వేలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కడప వంశీధరరెడ్డి, నిర్వాహకుడు పాండురంగారెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అదృశ్యం కాలేదు.. ఆత్మహత్య చేసుకున్నాడు

- అమ్మనబ్రోలు శ్మశానంలో కుళ్లిన స్థితిలో కనిపించిన మృతదేహం
- 25 రోజుల క్రితం భార్యతో గొడవపడి వెళ్లిన వ్యక్తిదిగా గుర్తింపు



శ్రీనివాసరావు(ఫైల్)

నాగులుప్పలపాడు: భార్యాభర్తల మధ్య గొడవతో 25 రోజుల క్రితం ఇల్లు విడిచి వెళ్లిన వ్యక్తి గ్రామంలోని శ్మశానవాటికలో కుళ్లిన స్థితిలో శవమై కనిపించిన ఘటన గురువారం సాయంత్రం వెలుగు చూసింది. అమ్మనబ్రోలు గ్రామానికి చెందిన తోటపల్లి శ్రీనివాసరావు, జ్యోతి దంపతుల మధ్య 25 రోజుల కిందట తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది. దీంతో ఇంటి నుంచి అలిగి వెళ్లిన శ్రీనివాసరావు నేటికీ తిరిగిరాలేదు. గురువారం ఎస్సీ కాలనీలో ఒక వృద్ధురాలు అనారోగ్యంలో మరణించగా కాలనీవాసులు, బంధువులు అంత్యక్రియలు నిర్వహించేందుకు శ్మశానానికి వెళ్లారు. అక్కడికి కాస్త దూరంలో సమాధులపై ఎవరిదో మృతదేహం ఉన్నట్లు గుర్తించి విషయం పోలీసులకు తెలియజేశారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు మృతదేహం వద్ద సెల్‌ఫోన్, పురుగుల మందు డబ్బా, గ్లాసును గుర్తించి స్థానికులను విచారించారు. అక్కడి ఆనవాళ్లను బట్టి తోటపల్లి శ్రీనివాసరావు(40) మృతదేహంగా నిర్ధారించుకుని అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై హరిబాబు తెలిపారు. మృతదేహం తీవ్రంగా కుళ్లిన స్థితిలో ఉండటంతో శుక్రవారం శ్మశానంలోనే పోస్టుమార్టం నిర్వహించే అవకాశం ఉందని ఎస్సై చెప్పారు.

ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి



సంఘటనా స్థలంలో కృష్ణారెడ్డి మృతదేహం

మార్కాపురం: ముందు వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టిన ట్రాక్టర్ అదుపుతప్పి చెరువులో బోల్తా పడిన సంఘటన గురువారం రాత్రి మార్కాపురం చెరువు కట్టపై చోటుచేసుకుంది. ఈ సంఘటనలో బైక్‌పై వెళ్తున్న తర్లుపాడు మండలం కేతగుడిపి గ్రామానికి చెందిన మద్దిరెడ్డి కృష్ణారెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. కృష్ణారెడ్డి స్థానిక రైల్వే స్టేషన్ నుంచి మార్కాపురానికి బైక్‌పై వస్తున్నాడు. అదే సమయంలో బైక్‌ను ఓవర్ టేక్ చేయబోయిన ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో కృష్ణారెడ్డి మృతి చెందగా ట్రాక్టర్ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. సంఘటనా స్థలాన్ని టూటౌన్ ఎస్సై సువర్ణ పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పొగాకు బ్యారన్లు అగ్నికి ఆహుతి

- రైతులకు రూ.21 లక్షల ఆస్తి నష్టం



మాచవరంలో మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది


నాగులుప్పలపాడు: క్యూరింగ్‌లో ఉన్న పొగాకు బ్యారన్‌లో మొద్దుగొట్టంపై అల్లిక కర్ర జారిపడటంతో మొత్తం మూడు బ్యారన్లు అగ్నికి ఆహుతైన ఘటన గురువారం ఉదయం మాచవరం గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన దండా అంజిరెడ్డి, వాకి అంజిరెడ్డి, వాకా శ్రీనివాసరెడ్డి, ఇనగంటి వెంకటేశ్వరరెడ్డికి చెందిన మూడు పొగాకు బ్యారన్లు పక్కపక్కనే ఉన్నాయి. ఈ మూడింటిలో పొగాకు క్యూరింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో మధ్యలో ఉన్న బ్యారన్‌లో కర్ర జారి మొద్దుగొట్టంపై పడటంతో మంటలు చెలరేగి పక్కనే ఉన్న బ్యారన్లకు వ్యాపించాయి. మంటలను అదుపుచేయడానికి గ్రామస్తులు ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఒంగోలు నుంచి వచ్చిన ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేయగా, అప్పటికే పూర్తిగా పూర్తిగా కాలిపోయాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.15 లక్షల వరకు నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

పొన్నలూరు మండలంలో..

పొన్నలూరు: మండలంలోని పెదవెంకన్నపాలెం గ్రామంలో పొన్నగంటి మహేష్‌కి చెందిన పొగాకు బ్యారన్ గురువారం ప్రమాదవశాత్తు కాలిపోయింది. క్యూరింగ్ జరుగుతున్న సమయంలో పొగాకు అల్లిక కర్రలు జారి మొద్దుగొట్టంపై పడటంతో మంటలు చెలరేగాయి. కందుకూరు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. సుమారు రూ.6 లక్షలు ఆస్తి నష్టం సంభవించినట్లు బాధిత రైతు వాపోయారు.

జగన్ వెంటే మేమంతా..

- నూర్‌బాషా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రసూల్
- త్వరలోనే నూర్‌బాషా గర్జన



మాట్లాడుతున్న రసూల్

ఒంగోలు: తమ సామాజిక వర్గమంతా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉన్నారని నూర్‌బాషా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఒ.రసూల్ పేర్కొన్నారు. గురువారం స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అర్హులైన పేదలందరికీ న్యాయం చేయాలనేదే సీఎం ఉద్దేశమన్నారు. నూర్‌బాషా గర్జన చేపట్టాలనే ఆలోచనను సీఎం ముందు ఉంచగా ఆయన సూచించిన విషయం పేద ప్రజలపై అయనకు ఉన్న అపారమైన ప్రేమను తెలియజేసిందన్నారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలలో పర్యటించి నూర్‌బాషాల సమస్యలు తెలుసుకోవడంతో పాటు వారు ఇంకా ఏం కోరుకుంటున్నారో అర్థం చేసుకున్న తర్వాత గర్జన కార్యక్రమం నిర్వహించాలని సీఎం సూచించారని పేర్కొన్నారు. అందులో భాగంగానే తాము రాష్ట్రమంతా పర్యటిస్తున్నామన్నారు. నూర్‌బాషాలకు ఒక ఎమ్మెల్సీ పదవిని కేటాయించాలనే అంశాన్ని ముఖ్యమంత్రి ముందు ఉంచబోతున్నామన్నారు. పేదలకు అండగా నిలుస్తున్న సీఎంపై పచ్చ మీడియా దుష్ప్రచారం చేస్తుండటం బాధాకరమన్నారు. టైలర్ల సంఘం ఉపాధ్యక్షులు నాగూర్ మాట్లాడుతూ.. 14 ఏళ్లు సీఎం ఉన్న చంద్రబాబు నూర్‌బాషాలకు ఏం చేశారో సమాధానం చెప్పాలన్నారు. బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చంద్రబాబు చూశారని విమర్శించారు. నాయీబ్రాహ్మణులు, దళితులను చులకనగా చూసిన చంద్రబాబుకు మరోసారి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నూర్‌బాషా యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ శ్రీను బాషా, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకేసుల బాదుల్లా, వై.పాలెం అధ్యక్షుడు డాక్టర్ మీరావలి పాల్గొన్నారు.

గంజాయిపై ఉక్కుపాదం

- నేర సమీక్షలో ఎస్పీ మలికా గర్గ్
- దర్యాప్తులో వేగాన్ని పెంచాలని ఆదేశం
- మహిళా పోలీసులతో సమన్వయం చేసుకోవాలని సూచన



మాట్లాడుతున్న ఎస్పీ మలికా గర్గ్



ఎస్పీ నుంచి ప్రశంసా పత్రాలు అందుకుంటున్న పోలీసు అధికారులు, సిబ్బంది

ఒంగోలు టౌన్: గంజాయి కేసుల్లో దర్యాప్తును వేగంగా పూర్తి చేసి నిందితులకు శిక్షలు పడేలా చేయాలని ఎస్పీ మలికా గర్గ్ ఆదేశించారు. స్థానిక పోలీసు కళ్యాణ మండపంలో గురువారం నేర సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని పోలీసు స్టేషన్లు, సెబ్ స్టేషన్లవారీగా గత మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎన్డీపీఎస్ కేసులు, గంజాయి కేసులపై ఎస్పీ సమీక్షించారు. గంజాయి రవాణా, క్రయవిక్రయాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. పాత నేరస్తులు, వారి పరిచయస్తులపై నిఘా ఉంచాలని చెప్పారు. గంజాయి కేసుల్లో తప్పించుకుని తిరుగుతున్న నిందితులను సత్వరమే అరెస్టు చేయాలని ఆదేశించారు. మహిళా పోలీసులతో సమన్వయం చేసుకుంటూ సమాచార వ్యవస్థను బలోపేతం చేసుకోవాలని, సూచించారు. విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాల వినియోగం వైపు మొగ్గు చూపకుండా విద్యా సంస్థల్లో «సంకల్పం–డ్రగ్స్ వ్యతిరేక పోరాటం» కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే మహిళలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, స్పందన ఫిర్యాదులపై వేగంగా స్పందించాలని స్పష్టం చేశారు. అనంతరం న్యాయ నిపుణులు వెంకటేశ్వరరెడ్డి 41ఏ సీఆర్‌పీసీ నోటీసులు, చట్టాలపై అవగాహన కల్పించారు. సమీక్షలో ఏఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఎస్పీ(క్రైం) ఎస్వీ శ్రీధర్‌రావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్ బాబు, సెబ్ ఈఎస్ ఆవులయ్య, డీఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు, డీఎస్పీలు యు.నాగరాజు, నారాయణస్వామిరెడ్డి, పల్లపురాజు, విక్రం శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, సెబ్ అధికారులు శ్రీనివాసులు నాయుడు, సుధీర్ బాబు, లీగల్ అడ్వైజర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు ఎస్పీ ప్రశంస

హత్య, చోరీ, యాక్సిడెంట్ తదితర ఏడు కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ మలికా గర్గ్ అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఒంగోలు తాలుకా పోలీసు స్టేషన్లో నమోదైన హత్య కేసులో నిందితుడికి జీవితఖైదు పడేలా చేసిన అప్పటి సీఐ ఆంటోని రాజ్, కోర్టు కానిస్టేబుల్ ఎస్డీ సద్దాం, దర్శి పోలీసు స్టేషన్లో నమోదైన హత్య కేసులో నిందితురాలికి యావజ్జీవ శిక్ష పడేలా చేసిన అప్పటి సీఐ కేవీ రాఘవేంద్ర, హెడ్‌కానిస్టేబుల్ కాశయ్య, హోంగార్డు కె.కాశయ్యను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. బేస్తవారిపేట పోలీసు స్టేషన్ పరిధిలో ఓ హత్య కేసులో సీఐ శ్రీరాం, హెడ్ కానిస్టేబుల్ డి.దస్తగిరి, పీసీ పల్లి పరిధిలో యాక్సిడెంట్ కేసులో ఇద్దరు నిందితులకు శిక్ష పడేలా చేసిన అప్పటి కనిగిరి సీఐ ఎం.సుబ్బారావు, కోర్టు కానిస్టేబుల్ కేటీ నాయుడు, యర్రగొండపాలెం పోలీసు స్టేషన్ పరిధిలో యాక్సిడెంట్ కేసులో నిందితుడికి మూడేళ్ల శిక్ష పడేలా విధులు నిర్వహించిన అప్పటి సీఐ మల్లికార్జునరావు, కోర్టు కానిస్టేబుల్ హసన్న రాజులకు ఎస్పీ ప్రశంసా పత్రాలు అందజేశారు. అలాగే మార్కాపురం పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో దొంగతనం కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష పడేలా చేసిన అప్పటి ఎస్సై శశి కుమార్, కోర్టు కానిస్టేబుల్ ఎస్.భాస్కర్, పొదిలి పీఎస్ పరిధిలో చోరీ కేసులో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన అప్పటి ఎస్ఐ శ్రీహరి, కోర్టు కానిస్టేబుల్ రాజారత్నంతోపాటుగా ఆయా కేసుల్లో ట్రయల్ మానిటరింగ్ చేసిన కోర్టు లైజన్ ఆఫీసర్లు ఏఎస్ఐలు బి.సత్యనారాయణ, నాయక్, హెడ్‌కానిస్టేబుల్ ఐవీ శ్రీనివాసరావును అభినందించారు.

మూడు వడ్రంగి దుకాణాలు దగ్ధం



అగ్ని కీలల్లో కార్పెంటర్ దుకాణాలు



బాధితులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్

- కాలి బూడిదైన చెక్కలు, పరికరాలు, రెండు మిషన్లు, రెండు బైక్‌లు
- రూ.20 లక్షలకుపైగా ఆస్తి నష్టం

కనిగిరి రూరల్: కనిగిరి పట్టణంలోని గార్లపేట రోడ్డులో వాటర్ ట్యాంక్ వీధిలోని మూడు కార్పెంటర్ దుకాణాలు అగ్నికి ఆహుతయ్యాయి. బుధవారం అర్ధరాత్రి ఒంటి గంట తర్వాత పక్కపక్కనే ఉన్న వేణు, ప్రసాద్, విశ్వనాథచారికి చెందిన దుకాణాలు ఒక్కసారిగా తగలబడ్డాయి. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో ఫైర్ అధికారి రామకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. అప్పటికే దుకాణాల్లోని కోత చెక్కలు, వస్తువులు, రెండు బైక్‌లు, రెండు మిషన్లు పూర్తిగా కాలిపోయాయి. సుమారు రూ.20 లక్షలకు పైగా ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితులు చెప్పారు. ప్రమాదానికి గల కారణాలపై మూడు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. బాధితులను మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ గురువారం పరామర్శించారు. ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ సహకారంతో ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం అందేలా చూస్తామని బాధితులకు ధైర్యం చెప్పారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు పసుపులేటి అరుణోదర్, కంటు గురవయ్య, డాక్టర్ నాయబ్ రసూల్ ఉన్నారు.